నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, శుక్రవారం 19 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

- జిల్లా ఇన్‌చార్జి డీసీపీ అరవింద్‌బాబు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి డీసీపీ అరవింద్‌బాబు

భువనగిరి అర్బన్, జనవరి 18 : సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి డీసీపీ అరవింద్‌బాబు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని భువనగిరి పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా, రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆన్‌లైన్ రూ.10కి రూ.100 ఇస్తామని మెసేజ్‌లు పెడితే నమ్మి మోసపోవద్దని చెప్పారు. శాంతి భద్రలకు భంగం కలిగించకూడదన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రవికుమార్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐలు సుధీర్, కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

పడిపోతున్న నీటిమట్టం

జిల్లాలో భారీగా తగ్గిన భూగర్భ జలాలు

గతేడాదితో పోలిస్తే రెండింతలు కిందికి..
డిసెంబర్‌లో 6.04మీటర్ల లోతులో జలాలు
తక్కువ వర్షపాతం, ఎక్కువ వాడకం వల్లే..
ఇట్లయితే వేసవిలో తాగు, సాగు నీటి కష్టాలు
జిల్లాలో తగ్గిన యాసంగి సాగు

జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. నెలనెలా నీటి నిల్వలు తగ్గుతున్నాయి. గతేడాదితో పోలిస్తే రెండింతలు కిందికి పడిపోయాయి. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో నీటి కష్టాలు షురూ కానున్నాయి. తక్కువ వర్షపాతం, అధిక వాడకంతోనే భూగర్భ జలాలు పడిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. మరోవైపు చెరువులతోపాటు బోర్లు, బావుల్లో నీటి నిల్వలు లేకపోవడంతో జిల్లాలో యాసంగి సాగు కూడా తగ్గింది.

– యాదాద్రి భువనగిరి, జనవరి 18 (నమస్తే తెలంగాణ)

2.08 మీటర్లకు పడిపోయిన భూగర్భ జలాలు

భూగర్భ జలాల శాఖ తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలో డిసెంబర్‌లో సగటున 6.04 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉన్నాయి. 2022 డిసెంబర్‌తో పోలిస్తే 2023 డిసెంబర్‌లో భూగర్భ జలాలు 2.08 మీటర్ల మేర ఇంకిపోయాయి. 2022 డిసెంబర్‌లో సగటున 3.97 మీటర్ల మేర జలాలు ఉన్నాయి. 2023 నవంబర్‌లో 5.40మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉన్నాయి. అంటే గతేడాది నవంబర్‌తో పోలిస్తే డిసెంబర్‌లో 0.65 మీటర్ల మేర అడుగంటిపోయాయని లెక్కలు చెబుతున్నాయి.

ఆత్మకూర్(ఎం)లో 10.59 మీటర్ల లోతులో..

జిల్లాలో మొత్తం 17 మండలాలు ఉన్నాయి. వీటి నుంచి ప్రతినెలా భూగర్భ జలశాఖ అధికారులు వివరాలు సేకరిస్తారు. జిల్లాలో అత్యధికంగా ఆత్మకూర్(ఎం)లో 10.59, ఆ తర్వాత నారాయణపురంలో 8.94 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. తుర్కపల్లిలో 8.47 మీటర్ల లోతులో ఉండగా, ఇక్కడ అత్యధికంగా ఒక్కటే నెలలో 3.68 మీటర్ల మేర జలాలు పడిపోయాయి. ఇక బీబీనగర్‌లో 7.59, రామన్నపేటలో 7.29, మోటకొండూరులో 6.16, రాజాపేటలో 5.91, భువనగిరిలో 5.59, ఆలేరులో 5.53, చౌటుప్పల్‌లో 5.07, గుండాలలో 4.52, వలిగొండలో 4.20, భూదాన్‌పోచంపల్లిలో 3.92 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. అడ్డగూడూరులో 2.93 మీటర్ల లోతులోనే గంగమ్మ ఉబికివస్తున్నది.

మండలాల వారీగా భూగర్భ జలాలు(మీటర్లలో..)

మండలం	డిసెంబర్ 2022	డిసెంబర్ 2023
అడ్డగూడూరు	1.88	2.93
భూదాన్‌పోచంపల్లి	3.10	3.92
వలిగొండ	2.47	4.20
గుండాల	2.73	4.52
చౌటుప్పల్	3.61	5.07
ఆలేరు	3.38	5.53
భువనగిరి	4.00	5.59
రాజాపేట	3.48	5.91
మోత్కూరు	3.54	6.16
యాదగిరిగుట్ట	4.90	6.18
మోటకొండూరు	4.26	7.00
రామన్నపేట	5.48	7.29
బొమ్మలరామారం	5.40	7.36
బీబీనగర్	5.78	7.59
తుర్కపల్లి	4.79	8.47
నారాయణపురం	6.39	8.94
ఆత్మకూర్ (ఎం)	7.21	10.59
జిల్లా సగటు	3.97	6.04

ఇక వేసవిలో నీటి కష్టాలు?

భూగర్భ జలాలు తగ్గిపోతుండటంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో నీటి కొరతను ఎలా అధిగమిస్తామోనని తలలు పట్టుకుంటున్నారు. ముఖ్యంగా తాగు, సాగునీటికి కష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికే కృష్ణాబేసిన్‌లో నీళ్లు లేవు. అక్కడ క్రాప్ హాలిడే ప్రకటించారు. భువనగిరి ప్రాంతంలో బస్వాపూర్ ప్రాజెక్ట్ ఉండటంతో ఈ ప్రాంత ప్రజలకు ఉపశమనం ఉండే అవకాశం ఉన్నది. ప్రాజెక్టులో ఎప్పటికీ నీళ్లు ఉండుటంతో చుట్టు పక్కల ప్రాంతాలకు పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని అధికారులు చెబుతున్నారు.

కారణాలు ఇవే..

భూగర్భ జలాలు పడిపోవడానికి అధికారులు పలు కారణాలు చెబుతున్నారు. ఈ ఏడాది వర్షపాతం సగటున నాలుగు శాతం తక్కువగా నమోదైంది. ఇక నీటి తోడకం, వాడకం ఎక్కువ అవడం కూడా ఓ కారణంగా పేర్కొంటున్నారు. వ్యవసాయం, పరిశ్రమలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. డ్రింకింగ్ వాటర్ కూడా పెరిగింది. 3, 4 సంవత్సరాల క్రితం బాటిల్స్, టిన్స్ తక్కువగా వాడేది. ఇప్పుడు ప్రతి ఊర్లో ఫిల్టర్ వాటర్ వాడుతున్నారు. నీరు వృథాగా పోవడం కూడా భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి.

తగ్గిన సాగు..

జిల్లాలో యాసంగి సాగు తగ్గింది. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2,61,150ఎకరాల్లో సాగు జరుగనుండగా, ఇందులో అత్యధికంగా 2,40,500 ఎకరాల్లో వరి వేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ సారి గతేడాది కంటే 49వేల ఎకరాల్లో సాగు తగ్గే అవకాశం ఉందని భావించింది. ఇందుకు నీటి కొరత కారణంగా పేర్కొంటున్నారు. గతేడాది 3,10,165 ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పటి వరకు 1,45,989 ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది. ఇందులో అత్యధికంగా భూదాన్‌పోచంపల్లిలో 22,525 ఎకరాల్లో వరి వేశారు. ఈ నెలాఖరు వరకే సాగు చేసే అవకాశాలు ఉన్నాయని, ఇంకా సుమారు లక్ష ఎకరాల్లో సాగు చేయాల్సి ఉన్నది. అంచనా లక్ష్యం కూడా చేరుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా యాదగిరీశుడి కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, జనవరి 18 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. గురువారం ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేశారు. గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్య కల్యాణ తంతును నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం వేళ స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి వేళ స్వామివారికి తిరువారాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 12వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.44, 21,170 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

తుర్కపల్లిలో తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ హన్మంతు కె.జెండగే

18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

- కలెక్టర్ హన్మంతు కె.జెండగే

తుర్కపల్లి, జనవరి18 : జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ హన్మంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని తాసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్పెషల్ సమ్మరి రివిజన్‌లో భాగంగా 6,7 దరఖాస్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు లిస్ట్‌లో మార్పులు, చేర్పులకు సంబంధించి ఈ నెల 22 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉన్నందున ఇంటింటి సర్వే ద్వారా పరిశీలించి నివాసం ఉన్న వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. నివాసం మారిన వారిని ఫారం 8 ద్వారా దరఖాస్తు చేయించాలని తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనుల్లో పెండింగ్ ఉండొద్దని, పనుల రికార్డులు సకాలంలో నమోదు చేసి కూలీల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ దేశియా, ఎంపీఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

స్వాతంత్ర్య సమర యోధుడు రేపాల సత్యనారాయణ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

ఆదర్శనీయుడు రేపాల

- శాసన మండలి చైర్మన్ గుత్తా నివాళి

నల్లగొండ, జనవరి 18 : స్వాతంత్ర్య సమర యోధుడు రేపాల సత్యనారాయణకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాళులర్పించారు. సత్యనారాయణ సంస్మరణ సభ గురువారం నల్లగొండ పట్టణంలోని పోలీస్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. నకిరేకల్ మండలం మంగలపల్లిలో వ్యవసాయం కుటుంబంలో జన్మించిన రేపాల సమాజ సేవ కోసం ఎంతో కృషి చేశారన్నారు. పెత్తందారి వ్యవస్థ, బానిసత్వంపైన, కమ్యూనిస్టు భావాలతో ఆయన పోరాటం చేశారని గుర్తు చేశారు. రేపాల ఆదర్శనీయుడని, ఆయన ఆశయ సాధన కోసం కృషిచేయాలని గుత్తా సూచించారు.

5వ తరగతిలో గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

భువనగిరి అర్బన్, జనవరి 18 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని భువనగిరి సాంఘిక సంక్షేమ ప్రతిభ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 20వ తేదీలోపు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లాలో ఎంపిక చేసే కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షలో తెలుగుకు 20 మార్కులు, మెంటల్ ఎబిలిటీకి 10, ఇంగ్లిష్‌కు 25, ఈవీఎస్‌కు 20, మ్యాథ్స్‌కు 25 మార్కులు కలిపి మొత్తం 100 మార్కులతో కూడిన ప్రశ్నపత్రం ఉంటుందని చెప్పారు.

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి..

తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాల (సీఓఈ)లో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్ తెలిపారు. మరిన్ని వివరాలకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ www. tswreis.ac.in లేదా3 https// tswreisjc. cgg.gov.in సంప్రదించాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా రూ.200 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

20న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

భువనగిరి అర్బన్, జనవరి 18 : ఈ నెల 20న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ కె.నారాయణరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో 5 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. భువనగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గంజ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాల, మోత్కూర్, రామన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాల, యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతి ఉండదని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

రాయగిరిలో సినిమా షూటింగ్ కోసం వేస్తున్న సెట్

రాయగిరిలో సినిమా షూటింగ్ సందడి

షూటింగ్ స్పాట్‌లో డైరెక్టర్ శేఖర్‌కమ్ముల

భువనగిరి కలెక్టరేట్, జనవరి 18 : చిత్ర దర్శకుడు శేఖర్‌కమ్ముల దర్శకత్వంలో పుస్కూరు రామారావు నిర్మాణంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్‌ను గురువారం భువనగిరి పట్టణ పరిధిలోని రాయగిరిలో నిర్వహించారు. కథానాయకుడు ధనుష్‌తో రాయగిరి స్టేషన్ వద్ద గల వేంకటేశ్వరస్వామి కోనేరు వద్ద జాతరకు సంబంధించిన పలు సన్నివేశాలు చిత్రీకరించారు. షూటింగ్ విషయాన్ని తెలుసుకున్న వేలాది మంది సినీ అభిమానులు చిత్ర సన్నివేషాలను తిలకించేందుకు వచ్చారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించండి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే బాలూనాయక్ వినతి

కొండమల్లేపల్లి, జనవరి 18 : దేవరకొండ నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాలూనాయక్ మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలోని నక్కలగండి, డిండి ఎత్తిపోతల కింద చేపట్టిన సింగరాజుపల్లి, కిష్టరాయినిపల్లి, శివన్నగూడెం, గొట్టిముక్కల, పెండ్లిపాకల రిజర్వాయర్లకు నిధులు కేటాయించాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన డిప్యూటి సీఎం త్వరలో పెండింగ్ ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు విజయం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనగామలో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా బాలికల జట్టు ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నది. గురువారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో వరంగల్ జిల్లా జట్టుపై 48-42 స్కోరుతో విజయకేతనం ఎగురవేసింది. బాలుర విభాగంలో జిల్లా జట్టు ఫైనల్‌లో ఓడి ద్వితీయ బహుమతి గెలుచుకున్నది. విజేతలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. – జనగామ, జనవరి 18

మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

రామగిరి, జనవరి 18: 2024-25 విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 18నుంచి ఫిబ్రవరి 6వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. 5వ తరగతిలో కొత్త సీట్లకు, 6, 7, 8 తరగతుల్లో (కేవలం మైనారిటీ) ఖాళీలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల్లో బాలికలు, బాలురు సీట్ల కోసం ఇదే తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

హుజూర్‌నగర్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాల

దరఖాస్తుకు వీరు అర్హులు

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కుటుంబ వార్షిక ఆదాయం రూ.2లక్షలకు మించరాదు. సీట్లను లక్కీ డిప్ పద్ధతిలో ఎంపిక చేసి ప్రవేశాలు కల్పిస్తారు. సందేహాల నివృత్తి కోసం హైదరాబాద్‌లోని హెల్ప్ లైన్ కేంద్రం 040-23437909 ఫోన్ నంబర్‌కు చేయవచ్చు. http://tmreis. telan gana.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. నల్లగొండ బాలుర పాఠశాల 9490895916, దేవరకొండ బాలుర 7331170859, నల్లగొండ జూనియర్ కళాశాల 99597 09588, నకిరేకల్ పాఠశాల 72079 98960 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని నల్లగొండ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి టి.విజయాందర్‌రెడ్డి, ఆర్‌సీఓ విష్ణు సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలు

బాలికల కోసం హుజూర్‌నగర్, కోదాడ, నల్లగొండ, ఆలేరు, మిర్యాలగూడ, నకిరేకల్, బాలుర కోసం నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట, చౌటుప్పల్, దేవరకొండ, తుంగతుర్తి, అనుముల పాఠశాలలు ఉన్నాయి. ఐదో తరగతిలో మైనారిటీ విద్యార్థులకు 60, బీసీలకు 10, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, ఓసీలకు 2, ఇంటర్ మొదటి సంవత్సరంలో మైనార్టీలకు 60, బీసీలకు 5, ఎస్సీలకు 2, ఓసీలకు 1 చొప్పున సీట్లను కేటాయించారు.

21న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

భువనగిరి కలెక్టరేట్, జనవరి 18 : ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ మహిళల, పురుషుల ఖోఖో జట్లను ఈ నెల 21న భువనగిరిలోని ఇండోర్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకు భువనగిరిలోని ఇండోర్ స్టేడియం వద్దకు రావాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి నెలలో యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే 56వ సీనియర్ రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు పి.రమేశ్‌రెడ్డి-99630 85686, పి.ఆంజనేయులు-9848825255, ఎస్.పవన్ -9390330601, పి. శ్రీశైలం -9000690244 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

VIPASSANA EDUCATIONAL TRUST
HETERO INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
(Sai Spurthi Institute of Technology Campus)
B.Gangaram, Sathupally, Khammam District, Telangana - 507 303.
Mail ID : hipsr.principal@gmail.com
WANTED
1. Principal 2. Asso.Professors 3. Asst.Professors
4. Lab Technicians 5. Office Staff & Attenders
Interested and Qualified persons can send their resumes on or before 20.01.2024 by 5PM at the above address with all certificates and testimonials
Departments : Pharmaceutics, Pharmaceutical Chemistry, Pharmaceutical Analysis, Pharmacology & Pharmacognosy
Experience and salary will be as per the PCI norms.
Date : 17.01.2024
Secretary & Correspondent
Vipassana Educational Trust